## క్లుప్తంగా

### యోగాకు సమయాన్ని కేటాయించాలి



**రేపల్లె:** ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని ఎంపీడీవో ఎం.శోభారాణి సూచించారు. యోగాంధ్ర – 2025 కార్యక్రమంలో భాగంగా మండలంలో పేటేరు సచివాలయంలో సిబ్బందికి శనివారం నిర్వహించిన యోగా శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. యోగాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధుల అదుపుతో పాటు మానసిక రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. తమతో పాటు కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలు సైతం నిత్యం కొంత సమయం యోగాకు కేటాయించే విధంగా చైతన్యపరచాలని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నిత్యావసర సరుకుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

**వేమూరు:** జూన్ నుంచి కార్డుదారులకు రేషన్ డీలర్లే నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తారని, ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ సుశీల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి పంపిణీ ప్రారంభమవుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పంపిణీ చేస్తారని తెలిపారు. దివ్యాంగులకు, రేషన్ షాప్‌కు రాలేని వారికి డీలర్లే సరుకులు డోర్ డెలివరీ చేయాలని ఆమె సూచించారు. షాప్‌లో కార్డుదారుల వివరాలు, స్టాక్ పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలని, నిబంధనలు అతిక్రమించే డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

### ఎంపీడీవోగా శోభారాణి సేవలు ప్రశంసనీయం



**రేపల్లె రూరల్:** ఎంపీడీవోగా శోభారాణి సేవలు ప్రశంసనీయమని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన శోభారాణికి మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది శనివారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో పలువురు ఎంపీడీవోగా శోభారాణి సేవలను కొనియాడారు. అనంతరం దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో డీవీఎల్‌వీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పేట్రేగిపోతున్న ఇసుకాసురులు

- రాత్రికి రాత్రే అక్రమంగా ఇసుక తవ్వకాలు
- పేదలకు ఇచ్చిన స్థలంలో చెరువుల తవ్వకం
- కోర్టు ఆదేశాలు బేఖాతర్
- అధికారం అండతో చెలరేగిపోతున్న వైనం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- ఈస్ట్ పిన్నిబోయినవారిపాలెం జగనన్న కాలనీ దుస్థితి



జగనన్న కాలనీలో ఇసుక తవ్వకాలు

**బాపట్ల టౌన్:** ఈస్ట్ పిన్నిబోయినవారిపాలెంలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో అదే గ్రామానికి చెందిన కొందరు రాత్రికి రాత్రే ఇసుకను అక్రమంగా తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారం అండతో కొందరు స్వార్థపరులు పేదల స్థలాలను చెరువుల్లా మారుస్తున్నారు. దీనిపై పంచాయతీ, రెవెన్యూ అధికారులకు గ్రామానికి చెందిన పేదలు సమాచారం అందించినా ఫలితం లేదు. తవ్వకాలు జరిపి మూడు రోజులు అవుతున్నా క్షేత్రస్థాయిలో వీఆర్వోలు కనీసం తహసీల్దార్‌కు సమాచారం కూడా అందించలేదు. స్థానిక నాయకుల అండతో అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

#### 90 మందికి ప్లాట్లు కేటాయింపు

ఈస్ట్ పిన్నిబోయినవారిపాలెంలో సర్వే నంబర్లు 1205, 1207, 1209లో 3.08 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో తాటితోపులు, ముళ్లపొదలతో విష సర్పాలకు అవాసంగా ఉండేది. గత ప్రభుత్వం సర్వే చేయించి దాన్ని గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మండలంలోని మాజీ సైనికులతో కలిపి 90 మందికి ప్లాట్లు కేటాయించింది. రూ. 10 లక్షలు ఖర్చుచేసి ప్లాట్లలో మెయిన్ రోడ్డు, దానికి 15 లింక్ రోడ్లను అధికారులు ఏర్పాటు చేశారు. ప్లాట్లలో గ్రావెల్ రోడ్లు కూడా వేశారు. పేదల అభ్యున్నతిని చూసి ఓర్వలేని కొందరు స్వార్థపరులు అప్పట్లో డ్రైయిన్ పోరంబోకు అంటూ కోర్టును ఆశ్రయించారు. దీంతో పేదలకు కోసం రెడీ చేసిన పట్టాలు తహసీల్దార్ కార్యాలయంలో ఉన్నాయి. లాటరీ పద్ధతిలో పేదలకు ప్లాట్లను కేటాయించారు.

#### పట్టించుకోని పాలకులు, అధికారులు

కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం పేదలకు కేటాయిస్తే ప్రస్తుత కూటమి సర్కార్ నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో కొందరు స్వార్థపరులు కూటమి అండతో పెట్రేగిపోతున్నారు. ప్లాట్లను చెరువులా మారుస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

> **బాధ్యులపై చర్యలు తీసుకుంటాం**
>
> పేదలకు కేటాయించిన భూమిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిగిన విషయం నాకు తెలియదు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.
>
> – షేక్ సలీమ, తహసీల్దార్, బాపట్ల

### నిబద్ధతతో విధులు నిర్వహించినప్పుడే గుర్తింపు



కృష్ణారావును అభినందిస్తున్న ఏడీ మోహన్‌రాజు

**బాపట్ల:** ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వహించినప్పుడే ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకుంటారని సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులు టి. మోహన్‌రాజు అన్నారు. సమాచార శాఖలో 30 సంవత్సరాలు సేవలందించిన ఏ.వి.సూపర్‌వైజర్ గద్దం కృష్ణారావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం శనివారం స్థానిక జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో నిర్వహించారు. కృష్ణారావుతో పాటు ఆయన సతీమణిని అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు శాలువాలు కప్పి, పుష్పమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాలశాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్. కృష్ణమోహన్, ఏపీఆర్‌ఓ ఐ.సురేష్, పీఆర్వో కె.కిరణ్ కుమార్, సీనియర్ సహాయకులు పద్మావతి పాల్గొన్నారు.

### ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాలి



సమైక్యతా యాత్రలో సీపీఎం నాయకులు

**బాపట్ల:** ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలంతా కలిసికట్టుగా పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్. గంగయ్య అన్నారు. శనివారం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఐక్యంగా ఉగ్రవాదాన్ని ప్రతిఘటిద్దాం.. మత సామరస్యం.. ప్రజల ఐక్యతను కాపాడుకుందామని సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బాపట్ల పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన సమైక్యతా యాత్రలో ఆయన మాట్లాడారు. టెర్రరిస్టుల హత్యాకాండ, ప్రతీకారం పేరుతో ఉగ్రవాదులను వదిలిపెట్టి బాధితులు, లౌకికవాదులు, మైనారిటీలపై బీజేపీ ప్రభుత్వం విషయం కక్కుతుందని విమర్శించారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, కాంగ్రెస్ పార్టీలు వాస్తవాలు వివరించకుండా మతోన్మాదానికి మద్దతు పలుకుతున్నాయని తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు టి. కృష్ణమోహన్, పి. కొండయ్య, సీఐటీయూ నాయకులు శరత్, పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, కె. నాగేశ్వరరావు, గొర్రెలు, మేకల పెంపకం జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు, ఆదిశేషు పాల్గొన్నారు.



### ఘనంగా ఏఎస్పీ విఠలేశ్వర్ పదవీ విరమణ



అడిషనల్ ఎస్పీ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

**బాపట్ల టౌన్:** జిల్లాను ప్రశాంత వాతావరణంలో ఉంచేందుకు అడిషనల్ ఎస్పీగా టి.పి. విఠలేశ్వర్ విశేష సేవలందించారని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. విఠలేశ్వర్ పదవీ విరమణ కార్యక్రమాన్ని శనివారం రాత్రి పట్టణంలోని గౌతమి గ్రాండ్‌లో నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎంతో అనుభవం ఉన్న విఠలేశ్వర్ పదవీ విరమణ చేయడం బాధాకరమని తెలిపారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించే వారికి పని ఒత్తిడి అధికంగా ఉంటుందని, దానివల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. అయితే, వాటన్నిటిని అధిగమించి 40 సంవత్సరాల పాటు పోలీస్ శాఖకు విఠలేశ్వర్ విశేష సేవలు అందించడం హర్షనీయమని పేర్కొన్నారు. సన్మాన గ్రహీత విఠలేశ్వర్ మాట్లాడుతూ 'నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది' అనే సామెత పోలీస్ శాఖలో చాలా బాగా ఉపయోగపడుతుందని తెలిపారు. కుటుంబ సభ్యులు, అర్ధాంగి సహాయ సహకారాలు ఉన్నప్పుడే విధులను సమర్థంగా నిర్వహించగలుగుతామని చెప్పారు. అనంతరం అడిషనల్ ఎస్పీ దంపతులను పూలమాలలు, దశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చీరాల, బాపట్ల, రేపల్లె, సీసీఎస్ డీఎస్పీలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### వైభవంగా డాక్టర్ ఈవూరి గణేష్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న గణేష్ దంపతులు, నాయకులు



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ అతిక్

**చెరుకుపల్లి:** నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ వారికి ఏ సమస్య వచ్చినా వెన్నంటి ఉంటానని రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ముందుగా వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు డాక్టర్ గణేష్‌ను పూలమాల, దుశ్శాలువాతో సత్కరించారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని అన్ని మండలాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు డాక్టర్ గణేష్, డాక్టర్ కేశవతి దంపతులను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ మదన్ మోహన్, కామినేని కోటేశ్వరరావు, మండలాల కన్వీనర్లు దుండి వెంకటరామిరెడ్డి, ఐ.రామకృష్ణ, శేషగిరి, మేడికొండ అనిల్, యార్లగడ్డ రాంబాబు, చల్లా రామయ్య పాల్గొన్నారు.

#### మదరసాలో అన్నదానం

**రేపల్లె:** వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని బాపట్ల జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షురాలు నసీరున్నీసా బేగం, డాక్టర్ అతిక్ బేగ్‌ల సహకారంతో నగరం మండలం సజ్జావారిపాలెంలోని మదరసాలో చిన్నారులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బర్త్‌డే కేక్‌ని కట్ చేశారు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ అతిక్ పాల్గొన్నారు.

### అవినీతి కాంట్రాక్టర్లకు ఎందుకు కొమ్ము కాస్తున్నారు?

హౌసింగ్ డీఈపై మంత్రి మనోహర్ ఆగ్రహం




హౌసింగ్ డీఈ రఫీఉల్లాఖాన్‌ను ప్రశ్నిస్తున్న మంత్రి మనోహర్

**తెనాలి అర్బన్:** "పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామని డబ్బులు వసూలు చేసి మోసం చేసిన కాంట్రాక్టర్లపై చర్య లు తీసుకోమని ఏడాది నుంచి ఆదేశిస్తున్నాం. కానీ ఇప్పటికి మీరు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.. ఎందుకు మీరు వారికి కొమ్ము కాస్తున్నా"రంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హౌసింగ్ డీఈ రఫీఉల్లాఖాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెనాలి యడ్లలింగయ్య కాలనీలో శనివారం పర్యటించిన ఆయన్ను పలువురు మహిళలు కలిసి కాంట్రాక్టర్లపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ తెనాలి నియోజవర్గంలో ఇళ్ల నిర్మాణాలలో పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందని, ఇంతస్థాయిలో ఎన్నడు జరగలేదంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈనెల 5వ తేదీలోపు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ ఆనంద్, డీఈలను ఆదేశించారు. నియోజవర్గ పరిధిలోని లబ్ధిదారుల జాబితా తయారు చేసి వారి స్థలాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించాలని సూచించారు. త్వరలో లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించి వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి ప్రకటించారు.

### చైర్‌పర్సన్ భర్తపై కేసు

**తెనాలి రూరల్:** మున్సిపల్ చైర్‌పర్సన్ భర్తపై పోలీసు కేసు నమోదైంది. తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశం సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక భర్త తాడిబోయిన రమేష్ తనతో పాటు ఇతర కౌన్సిలర్లపై దాడికి ప్రయత్నించారని టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగనన్న కాలనీల గురించి చర్చ జరుగుతుండగా రమేష్ దూసుకొస్తూ దూషిస్తూ చంపుతానని బెదిరించారని ఆమె ఆరోపించారు. దీనిపై పోలీసులు 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

### వైభవంగా ఓంకారేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట



ఓంకారేశ్వరస్వామి మూలవిరాట్

**తెనాలి:** స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఓంకార ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన శ్రీపార్వతీ సమేత శ్రీఓంకారేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ నిధులు, దేవదాయ ధర్మదాయ శాఖ, దాతల సహకారంతో ఆశ్రమంలో పరివార దేవత, శిఖర, ధ్వజస్తంభ, శ్రీ శరభ సాళ్వేశ్వర స్వామి, శ్రీ పార్వతీ సమేత ఓంకారేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట ఉదయం 8.19 గంటలకు జరిపారు. శైవాగమ పండితుడు మామిళ్లపల్లి మృత్యుంజయ ప్రసాద్ శివాచార్య నేతృత్వంలో పండితులు ఆగమోక్తంగా ప్రతిష్ఠా కార్యక్రమాన్ని జరిపారు. జూన్ 29 తేదీ నుంచి ప్రారంభమైన ప్రతిష్ఠా మహోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం యంత్ర బింబ, ధ్వజప్రతిష్ట, కళాన్యాసం, ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించారు. తాళ్లాయపాలెం శ్రీశైవ పీఠాధిపతి శ్రీ శివస్వామి, ఒంగోలులోని సంతు సదానంద గౌరవాధ్యక్షురాలు మహా విద్యానందగిరి మాతాజీ పాల్గొన్నారు. శివ స్వామీజీ, మాతాజీ భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.



### అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి పింఛన్ మంజూరు

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



మోపర్రులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

**అమర్తలూరు(వేమూరు):** కూటమి ప్రభుత్వ పాలనలో అర్హత ఉన్న ప్రతి వ్యక్తికీ పింఛన్ మంజూరు చేస్తామని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. అమర్తలూరు మండలంలోని మోపర్రులో శనివారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ నెల 1వ తేదీ ఆదివారం రావడంతో 31వ తేదీనే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, గొట్టిపాటి గంగయ్య, ఎంపీడీవో మారుతీ శేషాంబ, రాజేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

#### నియోజకవర్గంలో 94 శాతం పింఛన్ల పంపిణీ

**వేమూరు:** నియోజకవర్గంలో 94 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శివన్నారాయణ తెలిపారు. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి పంపిణీ ప్రారంభించినట్లు చెప్పారు. వేమూరు మండలంలో 90.75 శాతం, కొల్లూరు మండలంలో 92 శాతం, అమర్తలూరు మండలంలో 93 శాతం, చుండూరు మండలంలో 95 శాతం, భట్టిప్రోలు మండలంలో 92 శాతం పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన వారికి సోమవారం పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### పొగాకుతో పలు రకాల ఆరోగ్య సమస్యలు



**దుగ్గిరాల:** దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఇందిర మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 31న పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తారని, పొగాకులోని నికోటిన్ అనే రసాయనిక పదార్థం వల్ల శారీరక, మానసిక సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్, మానసిక ఒత్తిడి, రక్తపోటు వంటి సమస్యల వల్ల జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని తెలిపారు. ఆశా వర్కర్లు ఎన్‌సీడీ ప్రోగ్రాం ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు నోటిలో ఉండే నల్లటి మచ్చలు గుర్తించి, ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేస్తారన్నారు. తద్వారా ముందుగా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.

### జూదరుల అరెస్టు

**అమర్తలూరు(వేమూరు):** అమర్తలూరు మండలంలోని పెదపూడిలో శనివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవితేజ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 880 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.